ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 10 సెప్టెంబరు 2025



ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలం కబ్జా!

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

మహాముత్తారం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి చెందిన కొంత భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేసే యత్రం చేసున్నాడని కొంత మంది రైతులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ కోసం వినియోగిస్తున్న భూమిని ఆ వ్యక్తి చదును చేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ భూమి వైపు రావద్దని తాము చెప్పినా అతడు చదును చేసి సాగు చేయాలని చూస్తున్నడని తెలిపారు.



- ఎన్ఐఆర్ఎఫ్ తాజా ర్యాంకుల్లో వెనుకబాటు
- న్యాక్ ర్యాంక్ 3.36 నుంచి 3.27కి పడిపోయిన వైనం
- నత్తనడకన సాగుతున్న రూసా ప్రాజెక్టు పనులు
- అవినీతి ఆరోపణలు.. ఏసీబీ, విజిలెన్స్ విచారణలు..
- పాలనలో ఒకే సామాజికవర్గ ఆధిపత్యంపై విమర్శలు
- పాలనను సమూలంగా ప్రక్షాళన చేయాలంటున్న విద్యావేత్తలు
- పరిశోధన, అకడమిక్ అభివృద్ధిపై దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

గతమెంతో ఘనం.. వర్తమానం దైన్యం

కాకతీయ విశ్వవిద్యాలయం- రాష్ట్రంలో అతిపెద్ద రెండో యూనివర్సిటీ. ఉన్నత విద్యను అందించడంలో, ప్రమాణాలు పాటించడంలో, పరిశోధనలు సాగించడంలో, నిష్ణాతులను అందించడంలో ఈ యూనివవర్సిటీ ఒకప్పుడు కేరాఫ్‌గా ఉండేది. ఉస్మానియా తర్వాత, చారిత్రక వరంగల్ కేంద్రంగా కేయూ తనదైన అస్థిత్వాన్ని చాటుకుంది. లక్షలాది మంది విద్యార్థులకు విద్యావెలుగులు పంచింది. వారు ఉన్నత స్థానాల్లో స్థిరపడేందుకు దోహదపడింది. అయితే కొన్నాళ్లుగా కేయూ ప్రతిష్ఠ మసకబారుతోంది. ఇందుకు గత పాలకుల నిర్లక్ష్యం ఒక కారణం కాగా, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం, అలసత్వం మరో కారణంగా కనిపిస్తోంది. తాజాగా వెలువడిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో వెనుబడటమే కాకుండా, 2023లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కాన్సిల్ (ఎన్ఏఏసీ) సీజీపీఏ పడిపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అవినీతి అక్రమాలు, కులాలూ వర్గాల పక్షపాతం, రాజకీయ ప్రాపకం వంటివి యూనివర్సిటీకి మచ్చ తెస్తున్నాయి. కేయూ ప్రతిష్ఠ మరింత దిగజారకముందే, కొత్త పాలకవర్గం... అకడమిక్, పరిశోధనల మెరుగుకు చర్యలు చేపట్టాలని, లోపాల దిద్దుబాటుకు ఉపక్రమించాలని విద్యానిపుణులు కోరుతున్నారు.

ఏడాదికేడాది మసకబారుతున్న కేయూ ప్రతిష్ఠ

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాకతీయ విశ్వవిద్యాలయం తెలంగాణలో అతి పెద్ద రెండో యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. ఉస్మానియా వర్సిటీ తరువాత రాష్ట్రంలో కేయూకే పేరుంది. గతంలో కేయూ అనేక ప్రతిష్ఠాత్మక విజయాలు సాధించింది. 2017లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కాన్సిల్ (ఎన్ఏఏసీ)లో 3.36 సీజీపీఏ (క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్)తో కేయూ ఎ-గ్రేడ్ సాధించింది. 2018లో నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) 2 బ్యాండ్‌లో (101-150), 3 బ్యాండ్‌లో (151-200)లో స్థానంలో మెరుగైన స్థానాన్ని కేయూ సాధించింది. ఈ విజయాలకు సూచికగా అదే ఏడాది రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా) నుంచి పరిశోధన, ఇన్నోవేషన్ కోసం రూ.50 కోట్లు గ్రాంట్ కూడా కాకతీయ విశ్వవిద్యాలయం పొందింది. అలాగే ఫార్మసీ కళాశాల 2021లో 48వ ర్యాంక్, 2022లో 46వ ర్యాంక్ సాధించడం విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను మరింత పెంచింది. కానీ, ఈ విజయాలన్ని చరిత్రగా మిగిలిపోతున్నాయి. వరుసగా ర్యాంకింగ్‌లో వెనుకబడిపోతుండటం గత చరిత్రను కనుమరుగు చేస్తోంది. తాజాగా ప్రకటించిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో కేయూ వెనుబడిపోయింది. ఆంధ్ర, ఉస్మానియా వంటి యూనివర్సిటీలు ర్యాంకింగ్‌లో ముందంజలో ఉండగా, కేయూ వెనుకబడి పోవటంపై అధ్యాపక, విద్యార్థి వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

ఇంజనీరింగ్ విభాగంలో వరంగల్‌కు చెందిన ఓ ప్రైవేటు వర్సిటీ 2 బ్యాండ్‌లో (101-150) సాధించింది. కొత్తగా పుట్టుక వచ్చిన ప్రైవేటు వర్సిటీలు ర్యాంకులు సాధిస్తుంటే, ఘన చరిత్ర ఉన్న కేయూ వెనుబడటం విచారకరమని అధ్యాపకులు అభిప్రాయ (మిగతా 7లో..)

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

వరంగల్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

10, 11, 12 తేదీల్లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి **(సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485** ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లినిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కటిచేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

13న మేడారానికి సీఎం రేవంత్‌రెడ్డి

అభివృద్ధి పనుల క్షేత్రస్థాయి పరిశీలన



ములుగు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో మేడారంలో పర్యటించనున్నారు. ఈనెల 13న ఆయన రానున్నారని మంత్రి సీతక్క తెలిపారు. 2026 జనవరి 28న జరగనున్న మేడారం మహాజాతర పనులను, గద్దెల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం పర్యటించనున్నారు. దేవాలయాల అభివృద్ధిపై హైదరాబాద్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌తో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి తన పర్యటన గురించి ప్రస్తావించారు. వారం రోజుల్లోగా మేడారానికి వచ్చి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని స్వయంగా ప్రకటించారు. ఈక్రమంలోనే మంత్రి సీతక్క ములుగు జిల్లాలోని పలు శాఖల అధికారులతో మంగళవారం ఐటీడీఏలో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గోవిందరావుపేట పర్యటనలో ఆమె మాట్లాడుతూ సీఎం ఈ నెల 13న మేడారానికి రానున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.



నిందితుడికి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్

వ్యాపారిపై పీడీ యాక్టు

కొన్నాళ్లుగా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన హైదరాబాద్ మెహదీపట్నంకు చెందిన ముద్దంగుల ఆదిత్యపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పీడీ యాక్టు నమోదు చేశారు. ఈ మేరకు పరకాల జైలులో ఉన్న నిందితుడికి సీపీ జారీచేసిన పీడీ యాక్టు ఉత్తర్వులను పరకాల ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ మంగళవారం అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా, పీడీ యాక్టు అందుకున్న నిందితుడితో పాటు మరో ఆరుగురు వ్యక్తులు కలిసి ముఠాగా ఏర్పడి కాలంచెల్లిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుంచి తక్కువ డబ్బులకు కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తూ గత జూన్ 6న పరకాల పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ముఠా నుంచి రూ.63లక్షల 62వేల విలువ గల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకుకొని పరకాల జైలుకు తరలించారు. నిందితుడిపై గతంలో ఇదే తరహా మోసంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి.

కొంగు నడుముకు చుట్టి.. పోరుజెండా పట్టి..



- దేశ్‌ముఖ్‌లను గడగడలాడించిన చాకలి ఐలమ్మ
- భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు చిహ్నం
- ప్రజా పోరాటాలకు నిత్యస్ఫూర్తిదాయకం
- నేడు సమరయోధురాలు 40వ వర్ధంతి

వివరాలు: 7 పేజీలో...

మేడారం అభివృద్ధిలో జాప్యం చేయొద్దు

- త్వరితగతిన పనులు ప్రారంభించండి
- అధికారులతో మంత్రి ధనసరి సీతక్క
- కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో కలిసి పర్యటన
- గద్దెల మార్పుపై పూజారులతో చర్చ

తాడ్వాయి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతర అభివృద్ధి పనుల్లో ఏమాత్రం జాప్యం చేయకుండా త్వరగతిన పూర్తిచేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, పలు శాఖల అధికారులతో కలిసి మంత్రి మంగళవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వీఐపీ పార్కింగ్ రోడ్డు, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, హరిత హోటల్, గద్దెల పరిసరాలు, క్యూ లైన్లను పరిశీలించారు. మహాజాతర సమీపిస్తున్న దృష్ట్యా అభివృద్ధి పనులను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గద్దెల పరిసరాలను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా మారనున్న గద్దెల రూపుపై పూజారులు, అధికారులతో చర్చించారు. వెంటనే గద్దెల ప్రాకారం అభివృద్ధి పనులను చేపట్టాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశం గదిలో పూజారులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్లైడ్‌షో ద్వారా గద్దెల మాస్టర్ ప్లాన్ రూపకల్పనను మరోసారి వివరించారు. పూజారులు, అధికారులు సమన్వయంతో పనులను త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. గోవిందరాజు, పగడిద్దరాజు గద్దెల మార్పు, ప్రాకారం విస్తరణ, అతిథి గృహాల నిర్మాణం, ఫ్లడ్ లైట్లు, డ్రెయినేజీ వ్యవ స్థ, ఉప మండపం ఏర్పాటు, క్యూ లైన్ల విస్తరణ, రహ దారుల మరమ్మతు, భక్తుల సౌకర్యాలు తదితర అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. యావత్తు ప్రపంచమే అబ్బురపడేలా మేడారంలో అభివృద్ధి జరగాలని (మిగతా 8వ పేజీలో)



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి



వన దేవతలను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

కాళోజీకి ఘన నివాళి

కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు



కాళోజీ నారాయణరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఇతర అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాహుల్ శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యం నింపాయన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్‌బాబు అన్నారు. భూపాలపల్లి కోర్టు ఆవరణలో ఈనెల 13న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కరించుకునేలా కక్షిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రకాల కేసులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.నాగరాజ్, జూనియర్ జడ్జి దిలీప్‌కుమార్, అడిషనల్ జూనియర్ జడి అఖిల, సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- మండలాల్లో విస్తృత పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



టేకుమట్ల మండలం వెలిశాల జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండలంలోని గిద్దెముత్తారం, కాల్వపల్లి ప్రధానరహదారిపై హైలెవల్ వతెన నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని అన్నారు. గ్రామాలకు రవాణా సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రూ. కోటితో నిర్మించే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమామ్‌బాబా షేక్, చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, టీపీసీసీ సభ్యుడు గాజర్ల అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు మధువంశీకృష్ణ, తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, పప్పుల సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

● గణపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో, కుందయ్యపల్లి, చెల్పూరు, ఆయా గ్రామాలను కలుపుతూ ఉండే లింక్ రోడ్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సుమారు రూ. 12కోట్లతో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. చెల్పూరులోని గ్రామ శివారులో మాటుకు ఏర్పాటు చేసిన మోటార్‌ను స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్, చోటేమియా, కుమార్, అశోక్, శ్రీనివాస్, వెంకన్న, సంపత్‌రావు, శివశంకర్, ముత్యాల రాజయ్య, మలహల్‌రావు, మాధవరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో రూ.కోటి 20 లక్షలతో నిర్మించనున్న మెంటల్ రోడ్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. వెలిశాల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ (మిగతా 8వ పేజీలో)



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

మహబూబాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కలిశారు. రవీందర్‌రావు తన జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి, ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో రవీందర్‌రావు సతీమణి తక్కెళ్లపల్లి సంధ్యారాణి, కుమారులు యశ్వంత్‌రావు, నిఖిల దంపతులు, డాక్టర్ దుష్యంత్‌రావు పాల్గొన్నారు. తొలుత మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు తరలి వచ్చి రవీందర్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిపై పీడీ యాక్టు

గణపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిపై పీడీయాక్టు నమోదు చేసినట్లు భూపాలపల్లి జిల్లా గణపురం సీఐ కరుణాకర్‌రావు మంగళవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండల జంగేడుకు చెందిన దురిశెట్టి నిరంజన్‌పై పలు పోలీస్ స్టేషన్లలో 20కు పైగా చోరీ కేసులు నమోదయ్యాయి. రెండు నెలల క్రితం ధౌజండ్ క్వార్టర్స్‌లో జరిగిన చోరీలో కూడా అతడు హస్త ఉంది. దీంతో ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీయాక్టు) నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడు నిరంజన్ ఇప్పటికే చర్లపల్లి జైలులో ఉన్నట్లు పేర్కొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన.. ఇద్దరిపై కేసు

బచ్చన్నపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అబ్దుల్ హమీద్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన శశిధర్‌రెడ్డి ఈనెల 5న తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఓ మహిళ ఆలస్యంగా సోమవారం రాత్రి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ద్విచక్ర వాహనంపై వస్తుండగా, ఆపి శశిధర్‌రెడ్డి అసభ్యంగా వ్యవహరించాడని, అలాగే 7న అదే గ్రామానికి చెందిన మహమూద్ అనే వ్యక్తి శశిధర్‌రెడ్డికి మద్దతుగా తనపై అమర్యాదగా వ్యవహరించాడని ఆ ఫిర్యాదులో పేర్కొనట్టు ఎస్ఐ వెల్లడించారు. మహిళ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

బాలిక ఆత్మహత్య

● అనారోగ్య సమస్యతో మనస్తాపం ● మీదికొండలో విషాదం



స్మరణి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని మీదికొండ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మీదికొండకు చెందిన కత్తి చిరంజీవి-మమత దంపతులకు కుమార్తె స్మరణి(14), కుమారుడు ఉన్నాడు. చిరంజీవి ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, మమత కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా, స్మరణి తొర్రూరు పట్టణంలోని ఓ ఫౌండేషన్ స్కూల్‌లో 9వ తరగతి చదు వుతోంది. గత నెలలో రాఖీ పౌర్ణమి పండుగకు ఇంటికి వచ్చిన బాలిక అనారో గ్యానికి గురైంది. తల్లిదండ్రులు వారి పనుల మీద వెళ్లగా, తమ్ముడు స్కూల్‌కి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అనారోగ్య సమస్యను తట్టుకోలేక రేకుల ఇంట్లోని ఐరన్ పైపునకు చీరతో ఉరి వేసుకుంది. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తమ్ముడు తలుపు తట్టినా ఎంతకీ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరివేసుకుని కనిపించింది. విషయం చుట్టు పక్కవారికి తెలపగా, వారు కిందకు దించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై వినయ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, బాలిక నుంచి సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నట్టు ప్రచారం సాగుతోంది.

ఆగని ఇసుక దందా

● ఇందిరమ్మ ఇళ్ల ముసుగులో అక్రమ వ్యాపారం?
● జంపన్నవాగు వద్ద జోరుగా తవ్వకాలు
● ధ్వంసమవుతున్న స్నానఘట్టాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు



వాహనాలు ఎక్కి దిగుతుండడంతో కూలిన స్నానఘట్టాలు

తాడ్వాయి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జంపన్నవాగు కేంద్రంగా ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వగా కొందరు స్వలాభం కోసం ఇదే అదునుగా రాత్రిళ్ల ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో అధికారులు నిఘా పెట్టి అక్రమ రవాణాలను అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. జంపన్నవాగులో చిలుకల గుట్ట నుంచి కొత్తూరు కాజ్‌వే వరకు ఇసుక తవ్వకాలు యంత్రాలతో కొనసాగుతున్నాయని సమాచారం.

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఉచితంగా ఇసుక తీసుకోవడానికి అనుమతులు మంజూరు చేసింది. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ ఇసుక నిల్వలను గుర్తించి నివేదికను సమర్పించారు. ఈ క్రమంలో మేడారం జంపన్నవాగులో ఇసుక రవాణాకు అనుమతులు మంజూరయ్యాయి. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు స్వలాభం కోసం రాత్రిళ్ల అక్రమంగా ఇసుక రవాణా చేయడం మొదలుపెట్టారు. స్థానికుల సమాచారం మేరకు అధికారులు దాడులు నిర్వహించి వాహనాలు పట్టుకొని కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. అయినప్పటికీ అక్రమ ఇసుక రవాణాలు మాత్రం ఆగడం లేదని స్థానికులు తెలుపుతున్నారు.

ఇటీవల ఆరు వాహనాల పట్టివేత

రాత్రి సమయంలో జంపన్నవాగులో ఇసుకను వెలికి తీస్తున్నారనే పక్కా సమాచారంతో స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. అక్రమంగా ఇసుక తరలించడానికి వచ్చిన మూడు లారీలు, లోడ్ చేయడానికి వచ్చిన మూడు జేసీబీలను పట్టుకున్నారు. దుండగులు పారిపోయే ప్రయత్నాలు చేశారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. అక్రమ ఇసుక తరలింపుపై హెచ్చరికలు చేశారు. ఇదిలా ఉండగా గతంలో తహసీల్దార్ గిరిబాబు రెండు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. ఈ క్రమంలోనే ఆయన బదిలీ కూడా అయిందని స్థానిక అధికారులు, పలు పార్టీల నాయకుల్లో చర్చ జోరుగా సాగింది.

ధ్వంసమవుతున్న స్నానఘట్టాలు

ఇసుకను వాగులో నుంచి బయటకు తీసే క్రమంలో వాహనాలు స్నానఘట్టాలపై వెళ్లాల్సి ఉంది. దీంతో స్నానఘట్టాలు పగుళ్లు తేలి ధ్వంసమవుతున్నాయని స్థానిక రైతులు తెలుపుతున్నారు. జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, స్నానఘట్టాలు కోతకు గురై వాగులో లోతట్టు గుంతలు ఏర్పడుతున్నాయని భక్తులు తెలపుతున్నారు. అంతేకాకుండా స్నానఘట్టాలపై నుంచి లోడు వాహనాలు వెళ్లడంతో అవి కూలిపోతున్నాయని అంటున్నారు.

గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ

సమగ్ర రోడ్ మ్యాప్‌ను రూపొందించాలి

అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర రోడ్‌మ్యాప్‌తో ప్రణాళిక రూపొందించాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ముఖ గుర్తింపు హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర కార్యచరణను రూపొందించాలన్నారు. విద్యుత్, తాగు నీరు, పారిశుధ్యం, వైద్య, రవాణా, భద్రత తదితర తదిత సౌకర్యాలపై దృష్టి పెట్టాలన్నారు. రానున్న మూడు రోజుల్లో నివేదిక తయారు చేసి అందించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల యు డైస్ నమోదు చేయాలని, విద్యార్థులు, సిబ్బంది ముఖ గుర్తింపు హాజరు నూరుశాతం అమలు చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి హాజరు, ప్రతి ఉపాధ్యాయుని సమయపాలన పారదర్శకంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ముఖ గుర్తింపును నూరుశాతం అమలు చేయాలన్నారు. ఇంటర్ ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత, నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి సీఐని సస్పెండ్ చేయాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సీఐని సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మడిపల్లి శ్యాంబాబు, జిల్లా సీనియర్ నాయకుడు అంబాల చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం తమ అధినేత మంద్యకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించగా సీఐ లాఠీచార్జి చేశారని దుయ్యబట్టారు. తమ నాయకులు, కార్యకర్తలపై కేసులుపెట్టి, కొట్టిన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని, లేదంటే దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బొల్లి బాబు, నోముల శ్రీనివాస్, దుర్గయ్య. భద్రయ్య, అంతడుపుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

లారీని ఢీకొట్టి గూడ్స్ వాహనం దగ్ధం

● పేలిన ఆక్సీజన్ సిలండర్లు ● ముగ్గురికి గాయాలు

బచ్చన్నపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనగామ- సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆలీంపూర్- వీఎస్ఆర్ నగర్ టోల్‌గేట్ మధ్య ఆగివున్న లారీని, అశోక లేలాండ్ గూడ్స్ వాహనం ఢీకొని దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరుకు చెందిన బొమ్మడవేణి శ్రీనివాస్, కొత్తూరు శ్రీను, తిప్పట్ల శ్రీనివాసులు రాజమండ్రి నుంచి చేప పిల్లలను సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామ చెరువులో వేసేందుకు తీసుకొస్తున్నారు. చేప పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న ఆక్సీజన్ సిలండర్‌లు పేలడంతో మంటలు వ్యాపించి గూడ్స్ వాహనం దగ్ధమైంది. ప్రమాదం జరగగానే రైతులు వాహనంలో ఇరుక్కున్న ముగ్గురిని బయటకు తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ అబ్దుల్ హమీద్ ఘటనాస్థలికి చేరుకుని, క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రూ. 9.50 లక్షల వాహనం దగ్ధం కాగా, రూ. 1.50 లక్షల చేపపిల్లలు చనిపోయాయని తెలిపారు. బొమ్మడవేణి శ్రీనివాస్ బావమరిది పెసరు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నకిలీ మద్యం స్వాధీనం

గార్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్ద కిష్టాపురం సమీపంలోని ముష్టికుంట చెరువు పారకం పంట కాలువలో సుమారు రూ.2 లక్షల విలవ చేసే నకిలీ మద్యాన్ని గార్ల పోలీసులతో పాటు ఎక్సైజ్ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం. పెద్ద కృష్టాపురం సమీపంలో ముష్టికుంట పంటకాలువలో భద్రపర్చి, రవాణాకు సిద్ధం చేసిన నకిలీ మద్యం బాటిళ్లకు సంబంధించిన సమాచారాన్ని స్థానికులు పోలీసులకు ఇచ్చారు. దీంతో ఎస్సై రియాజ్ పాష తమ సిబ్బందితో కలసి సుమారు 12 వందల క్వాటర్స్ (ఐబీ) మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకొని, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. ఈ నెలలోనే మహబుబాబాద్ జిల్లా కేంద్రంలో సమీపంలో ఇలాంటి మద్యం తయారీ ముఠాను పోలీసులు పట్టు కోవడం జరిగింది. అందులోని మాజీ మద్యం వ్యాపారి హస్తం ఉన్నట్లు గుట్టు బయట పడింది. అదే వ్యాపారి స్వగ్రామైన పెద్ద కిష్టాపురంలో మరల నకిలీ మద్యం దొరకడంతో వీరి వ్యాపారం జిల్లా నలు మూలల విస్తరించినట్లు చర్చించుకుంటున్నారు.

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీలో ఎన్‌డీఆర్ పార్టీల విలీనం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెండు విప్లవ సంస్థలు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రటిక్ రివల్యూషనరీ (ఎన్‌డీఆర్) పార్టీలు విలీనమై ఆ రెండు పార్టీలు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీగా కొనసాగాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఎన్డీఆర్ రాష్ట్ర కార్యదర్శి మేక రాంరెడ్డిలు మంగళవారం ప్రకటించారు. రెండు పార్టీల రాష్ట్ర స్థాయి నాయకులు సెప్టెంబర్ 7, 8 తేదీలలో నల్గొండ జిల్లా కేంద్రంలో చర్చలు జరిపి రెండు విప్లవ పార్టీలను విలీనం చేసినట్లు తెలిపారు. అనంతరం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా అశోక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం



సేవాలాల్‌సేన జెండా ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ వెంకన్ననాయక్

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ సేన ఆవిర్భవించి మంగళశారం నాటికి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో సేవాలాల్ సేన జెండాను ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ వెంకన్ననాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలు చేయడంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా జరిపించేందుకు నిధులు మంజూరులో సేవాలాల్‌సేన పోరాటం కీలకమైందన్నారు. పోడుకు తోడు.. పాదయాత్ర చేసి పోడు భూములకు పట్టాలు ఇప్పించడంలో, ఏజెన్సీలో ఉన్నటువంటి గిరిజనులకు ఉద్యోగాలు ఇప్పించడంలో, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ సాధించడంలో కీలకభూమిక పోషించిందన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ తీజ్, సీత్లాపండుగలకు విస్తృత ప్రచారం చేయడంలో, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై తీజ్ ఉత్సవాలు నిర్వహించి సేవాలాల్‌సేన లంబాడీల ఖ్యాతిని పెంచిందన్నారు. ఎక్కడ ఆపద వచ్చిన సేవాలాల్‌సేనగా ప్రజల్లో ముందుండి పోరాడుతామని స్పష్టం చేశారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కొంతమంది చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడంలో సేవాలాల్‌సేన ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దారావత్ మోతీలాల్‌నాయక్, బానోత్ కిషన్‌నాయక్, వీరునాథ్, మాలోతు సురేష్‌నాయక్, జర్పుల బాలునాయక్, బాదావత్ రాంబాబునాయక్, భూక్య స్రవంతి, బానోత్ దేవేందర్, బోడ సుమన్, బోడ రమేష్, బానోత్ సురేష్, దారావత్ శ్రీను, సాంబశివ, సోమ్లు, లిఖిత, నవీన, విజయ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్‌కు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కాటారం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం విద్యార్థులు కళా ఉత్సవ్-2025 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో విజువల్ ఆర్ట్స్ సోలో 3డీ స్కల్ప్చర్ విభాగంలో దేవసోత్ నవీన్, గ్రూప్ 3డీ విభాగంలో ఓంరెడ్డి, మణికంఠ, దుర్గాప్రసాద్ ప్రతిభ కనబర్చి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, డిప్యూటీ వార్డెన్ మహేందర్, ఆర్ట్ టీచర్ రజనీకాంత్, ఉపాధ్యాయలు బలరాం, కృష్ణమాచారి, సంతోష్, రాజబాబు, వెంకట్రాంరెడ్డి, రాజు, నీలిమ, పద్మ, రజిత అభినందించారు.

పొలంలో ట్రాక్టర్ తలకిందులై ఒకరి మృతి



వేణు(ఫైల్)

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బురద పొలంలో ఫుల్‌వీల్స్ అమర్చిన ట్రాక్టర్ తలకిందులై ఒకరు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్‌లోని నర్సంపేట బైపాస్ గాయత్రి గుట్ట సమీపంలో మేకాన్ చెరువు కట్టకింద మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని గుమ్మునూరు కాలనీకి చెందిన మాదాసు వేణు, అలియాస్ చింటు (33) మానుకోటలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని సాకుతున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని మేకాన్ చెరువు కట్ట కింద తనకు ఎకరం సాగుభూమి ఉంది. ఈ భూమి విషయంలో మరొకరితో కొతకాలంగా భూ వివాదం కొనసాగుతున్నట్లు తెలిపారు. సదరు పొలంలో తనకు తెలవకుండా మరొకరు వరినాటు వేసినట్లు సమాచారం తెలవడంతో మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో హుటాహుటిన పొలం వద్దకు వెళ్లాడు.

కౌలురైతు కత్తి రాందాస్‌కు చెందిన ట్రాక్టర్ పక్కనే ఉండడంతో ట్రాక్టర్‌పై ఎక్కి తన పొలంమడిలో వేసిన నాటును చెడిపేందుకు ప్రయత్నించడంతో ప్రమాదావశాత్తు ట్రాక్టర్ తలికిందులై బురద మడుగులో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎక్స్‌కావేటర్ యంత్రంతో గంటపాటు శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతునికి భార్య మనీష, కూతురు ఉండగా, భార్య మనీష రెండవ సంతానంలో నిండు గర్భిణీ. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ సీఐఎస్ఎఫ్ జవాన్ మృతి

చిట్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ ఆరెపెల్లి రమేష్ (36) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెపెల్లి భద్రమ్మ, సారయ్య దంపతులకు ఇద్దకు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రమేష్ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వెంటనే 2007లో హైదరాబాద్‌లోని సీఐఎస్ఎఫ్ బీడీఎల్ కాంచన్‌భాగ్ బెటాలియన్‌లో జవాన్‌గా ఉద్యోగం సాధించారు. ఎనిమిది నెలల క్రితం అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. రమేష్ ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. రమేష్ మృతదేహం స్వగ్రామానికి మంగళవారం ఉదయం చేరుకుంది. మృతదేహంపై సీఐఎస్ఎఫ్ ఏఆర్ ఎస్సై భాస్కర్ జాతీయజెండాను కప్పి నివాళ్ల అర్పిం చారు. సీఐఎస్ఎఫ్ రామగుండం ఎన్టీపీసీ యూనిట్ జవాన్లు తిరుపతిరావు, గణేష్, శ్రీధర్, అనిల్‌కుమార్, గీతమ్‌కుమార్ మండల కేంద్రం శివారులోని శ్మశానవాటిన వద్ద వందనం సమర్పించారు. జాతీయ జెండాను మృతుడి భార్య మమతకు అందించారు. రమేష్ అంత్యక్రియలు అధికారిక లంఛనాలతో జరిగాయి. మృతుడికి భార్య, కుమారు డు, కుమార్తె ఉన్నారు.



రమేష్ సతీమణికి జాతీయజెండాను అందజేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7580	5300
మక్కలు	2201	1521
కందులు	5633	3022
పెసళ్లు	4711	3022
పల్లికాయ (సూక)	6080	3500
పల్లికాయ (పచ్చిది)	4100	2400
పసుపు (కాడి)	10809	7889
పసుపు (గోల)	10509	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16500	12000
యూఎస్341ఏసీ	14600	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

పాలకుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ. ఐలమ్మ చేసిన భూ పోరాటం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. భూ పంపిణీ అంశం రాజకీయ ఎజెండాగా మారిందంటే, అందుకు ప్రేరణ ఐలమ్మ చేసిన పోరాటమే. నిజాం నియంతృత్వ పాలనపై తిరుగుబాటు చేసిన యోధురాలు ఆమె. ఐలమ్మ వృద్ధాప్యంతో 90 ఏండ్ల వయస్సులో సెప్టెంబరు 10న 1985లో కన్నుమూసింది. ఆమె మరణానంతరం పాలకుర్తిలో స్మారక భవనం, స్మారక స్థూపం నిర్మించారు. కాంస్య విగ్రహాన్ని 2015లో వామపక్షాలు ఉమ్మడిగా ఆవిష్కరించాయి. ఐలమ్మ 40 వర్ధంతి (సెప్టెంబరు 10)ని వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది.

- భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు చిహ్నం
- ప్రజా పోరాటాలకు నిత్యస్ఫూర్తిదాయకం
- నేడు సమరయోధురాలు ఐలమ్మ 40వ వర్ధంతి



ఉద్యమానికి కేంద్రం బిందువు...

ఎన్ని ఎత్తులు వేసినా దేశ్‌ముఖ్ ఓటమి పాలవ్వక తప్పలేదు. దీంతో పాలకుర్తి గ్రామంపై దాడులు చేయించాడు. ఐలమ్మ ఇంటి దోచారు. కార్యకర్తల ఇండ్లకు నిప్పు పెట్టారు. అయితే ఐలమ్మ పోరాటంతో భూస్వాములు భయంతో పట్టణాల బాటపట్టారు. ఐలమ్మ కొడుకులు దళ కమాండర్‌లుగా ఎదిగారు. ఐలమ్మ భూ పోరాటంతో సాయుధ పోరాటం జరిగింది. వేలాది ఎకరాలు భూములు ప్రజలకు పంచబడి గ్రామ స్వరాజ్యాలు ఏర్పడ్డాయి.

కొంగు నడుముకు చుట్టి.. పోరుజెండా పట్టి..

దేశ్‌ముఖ్‌లను గడగడలాడించిన చాకలి ఐలమ్మ

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టపురంలో ఐలమ్మ జన్మించింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి ఐలమ్మ కోడలుగా వచ్చింది. ఆమె వచ్చే నాటికి బానిస బతుకులు తప్ప ప్రశ్నించే రోజులు లేవు. కుల వృత్తిపై అధారపడి ఐదుగురు కొడుకులను, కూతురును పోషించుకునే స్థితి లేకపోవడంతో వ్యవసాయం వైపు మొగ్గుచూపింది. పాలకుర్తి మండలం మల్లంపల్లి మక్తేదారు కొండల్‌రావుకు చెందిన భూమి ఉండగా దానిని కౌలుకు తీసుకొంది. కొండల్‌రావు తల్లి జయప్రద దేవి కౌలుకిచ్చింది. భర్త నర్సయ్యతోపాటు మరిది సోమల్లయ్య, కొడుకులు సోమయ్య, లచ్చయ్యలతో వ్యవసాయం చేసేది. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న క్రమంలో భూస్వాముల నుంచి ఒత్తిళ్ల పెరిగాయి. దీంతో పోలీస్ పటేల్ వీరమనేని శేషగిరిరావుతో ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. ఐలమ్మ భూమిలోకి వెళ్లాలంటే పోలీస్ పటేల్ భూముల్లోంచే వెళ్లాలి. దారి లేదు. ముందుగా తన పొలంలో పని చేశాకే తర్వాత మీ భూముల్లో పని చేసుకోవాలని శేషగిరిరావు ఆదేశించాడు. దాన్ని ధిక్కరించి ఐలమ్మ పంట సాగు చేసింది. అదే సమయంలో దొరలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేస్తుండగా, ఐలమ్మ కుటుంబం ఆ పార్టీలో చేరింది. సంఘం కార్యక్రమాల్లో ఐలమ్మ చురుగ్గా పాల్గొనేది. ఇది చూసిన శేషగిరిరావు విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి ఐలమ్మపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఐలమ్మను, పార్టీని విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు చేశారు.



ఐలమ్మ స్మారక స్థూపం

కమ్యూనిస్టు నాయకులపై కుట్ర కేసు...

పాలకుర్తిలో 1945లో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సభను పెట్టాలని నిర్ణయించారు. ఇది సక్సెస్ అయితే తమకు నూకలు చెల్లుతాయని, తమ ఆధిపత్యానికి గండి పడుతుందని గ్రహించిన దేశ్‌ముఖ్.. గూండాలను పురమాయించాడు. పాలకుర్తి వీధుల్లో తిరుగుతూ కమ్యూనిస్టు నాయకుడైన ఆరుట్ల రాంచంద్రారెడ్డిని చంపుతామని బహిరంగంగా హెచ్చరించారు. కమ్యూనిస్టు నాయకులు తమ సభకు, నాయకులకు రక్షణ కల్పించాలని కోరినప్పటికి పోలీసులు నిరాకరించారు. పాలకుర్తిలో ఓ చోట సభ ప్రారంభం కాగానే దేశ్‌ముఖ్ గూండాలు అల్లరి సృష్టించారు. ఆరుట్ల రాంచంద్రారెడ్డిపై దాడికి దిగేలోపే ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఆ గూండాలపై ప్రతిదాడికి దిగి వారిని తరిమికొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆరుట్లను జాగ్రత్తగా మారువేషంలో వావిలాలకు పంపారు. తమ అనుచరులను చంపే ప్రయత్నం చేశారని దేశ్‌ముఖ్ కుట్ర చేసి కేసు పెట్టించాడు. నాయకుల్ని అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

అండగా కమ్యూనిస్టులు

ఐలమ్మ భూమిని, పంటను కాజేయాలని దేశ్‌ముఖ్ తప్పుడు పత్రాలు సృష్టించి భూమి తనదేనని బెదిరింపులకు గురి చేశాడు. అప్పటికే ఐలమ్మ భర్త నర్సయ్య, కొడుకులు సోమయ్య, లచ్చయ్యలు కుట్ర కేసులో జైల్లో ఉన్నారు. ఒంటరిగా ఉన్న ఐలమ్మను దెబ్బతీస్తే అటు ఐలమ్మ కుటుంబం ఇటు కమ్యూనిస్టు ఉద్యమం దెబ్బతింటుందని భూస్వాములు ఎత్తులు వేశారు. ఐలమ్మ ధైర్యంతో ముందుకెళ్లింది. కమ్యూనిస్టు నాయకులకు విషయాన్ని వెల్లడించింది. నల్లగొండ జిల్లా నాయకత్వం సీరియస్ తీసుకొని భూమి రక్షించేందుకు ప్రణాళిక రూపొందించారు. పాలకుర్తికి వచ్చి ఐలమ్మకు, స్థానిక పార్టీకి రక్షణగా అగ్రనాయకత్వం నిలిచింది.



పాలకుర్తి ఆర్గనైజర్ చకిలం యాదగిరిరావు, జిల్లా పార్టీ కార్యదర్శి దేవుళ్లపల్లి వెంకటేశ్వర్‌రావు, బీంరెడ్డి నర్సింహరెడ్డి, ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డిలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, వలంటీర్లు పాలకుర్తికి చేరుకున్నారు. ఐలమ్మ ఇంట్లోనే ఉంటూ ఆ ఇంటిని పార్టీ కార్యాలయంగా మార్చారు. 1945 నవంబరులో ఐలమ్మ భూమిలో పండిన ధాన్యాన్ని దోచుకురమ్మని గూండాలను పాలకుర్తికి పంపాడు. భూమిలో అడుగుపెట్టిన ఆ గూండాలను ఆంధ్రమహాసభ నాయకత్వం తిప్పికొట్టింది. తర్వాత ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. పారిపోయిన గూండాలు దేశ్‌ముఖ్‌కు విషయం చెప్పటంతో పోలీసులను పంపించి నాయకుల్ని అరెస్ట్ చేయించాడు. వారు నాయకులను చిత్రహింసలకు గురిచేశారు.

ఐలమ్మ కాంస్య విగ్రహం





కాళోజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వినయభాస్కర్

కాళన్న.. నిన్ను మరువదు ఈ గడ్డ..

ప్రజాకవికి ఓరుగల్లు ఘననివాళి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 111వ జయంతి వేడుకలు యావత్ ఓరుగల్లు నగరం నిండా అనేక ప్రాంతా ల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాహితీ వేత్తలతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కాళన్న సాహితీ సేవలను స్మరిస్తూ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని ప్రజాకవి కాంస్య విగ్రహానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లతోపాటు అధికారగణమంతా పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన సాహిత్య సేవలను స్మరిస్తూ నివాళులర్పించారు. కాళోజీ ఫౌండేషన్ పక్షాన అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి ఆధ్వర్యంలో అనేక సాహితీ ప్రముఖులు కాళోజీ కాంస్య విగ్రహం వద్దకు చేరుకొని మహనీయుడి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు.

ఈ సందర్భంగా రామశాస్త్రి మాట్లాడుతూ.. వందేళ్ల తెలంగాణ సాహిత్య, సామాజిక సాంస్కృతిక చరిత్రలో కాళోజీది ఓ సుదీర్ఘ అధ్యాయమన్నారు. నిత్యం ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి కవిత్వంతో పాలకరాజ్యంపై కటవుగా స్పందిస్తూ అక్షరాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించిన కాళోజీ ఎల్లవేలలా ఓరుగల్లుపై చెరగని ముద్ర వేశారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నవలాకారుడు అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించడం ఒక సువర్ణ అధ్యయం అయితే ఈ క్షేత్రంలో కవులు, రచయితలు, సాహిత్యకారులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు మినీ హాల్ నిర్మించి ఇస్తామన్న విషయం మరుగునపడిందని, దీన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఘంటా రామిరెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, పందిళ్ల అశోక్ కుమార్, శశాంక, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్‌లతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. అంతకుముందు కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, మరో కవి పొట్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి వచ్చి కాళోజీ నివాళులర్పించి హైదరాబాద్‌లో జరిగే కాళోజీ సాహిత్య సదస్సుకు తరలివెళ్లారు.



కాళోజీ జంక్షన్ వద్ద కాళోజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

మంగారి రాజేందర్‌కు కాళోజీ పురస్కారం

ఈ సారి ప్రముఖ కవి, న్యాయవాదిగా పేరు గడించిన మంగారి రాజేందర్‌కు కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారం, ప్రముఖ హిందీ, ఉర్దూ కవి అంజనీకుమార్ గోయెల్‌కు కాళోజీ రామేశ్వర్‌రావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసేందుకు తమ ఫౌండేషన్ నిర్ణయించిందని కాళోజీ ఫౌండేషన్ చైర్మన్ రామశాస్త్రి ప్రకటించారు. నవంబరు 14న జరిగే కాళోజీ సోదరుల యాది సభలో నగదుతో కవులను సత్కరిస్తామన్నారు.

గతమెంతో ఘనం.. వర్తమానం దైన్యం

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. అలాగే 2017లో న్యాక్‌లో 3.36 సీజీపీఏ (క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్)తో కేయూ ఎ-గ్రేడ్ సాధించింది. అయితే 2023లో ఇదే న్యాక్‌లో 3.27కి ర్యాంక్ పడిపోయింది.

రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా) నుంచి పరిశోధన, ఇన్నోవేషన్ కోసం రూ.50 కోట్లు గ్రాంట్ కూడా కేయూ పొందింది. ఈ ప్రాజెక్టు ద్వారా యూనివర్సిటీలో మౌళిక సదుపాయాలు, బోధన, అభ్యసన నాణ్యత, మెరుగుదల, అధ్యాపక అభివృద్ధి వంటి అంశాల్లో నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ఈ పాజెక్టులు నత్తనడక లో ఉండగా, పరికరాల కొనుగోలు మినహా పరిశోధనలో పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాలనలో నిర్లక్ష్యం.. రాజకీయ ఒత్తిళ్లు..

ఎన్నో ఘనమైన మైలురాళ్లను దాటిన కాకతీయ యూనివర్సిటీ ఇటీవల కాలంలో భూముల కబ్జాలు, అవినీతి, అక్రమాల ఆరోపణలతో ప్రతిష్ట మసకబారింది. కేయూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వర్సిటీ లోపల ఏసీబీ దాడులు, విజిలెన్స్ విచారణలు జరిగాయి. గతంలో పదవిలో ఉన్న వైస్ చాన్సలర్ అకడమిక్ అభివృద్ధి వైపు దృష్టి సారించక పోగా, అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాలు వర్సిటీ ప్రతిష్ఠను పదేళ్ల వెనక్కి నెట్టాయనే చర్చ జరుగుతుంది. అకడమిక్ నాణ్యత, పరిశోధనలపై శ్రద్ధ లేకపోవడం వల్ల విద్యార్థులు కూడా అవకాశాలు కోల్పోతున్నార ని విద్యా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పది నెలల క్రితం కొలువుతీరిన పాలకవర్గం పాలనలో ప్రత్యేకమైన మార్పులు తీసుకరావటంపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి అధికార పదువులు కట్టబెట్టడం, కీలకమైన కార్యక్రమాలకు కూడా ఆ వర్గానికి చెందిన వారినే ఆహ్వానించడం వర్సిటీ లోపల తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఇటీవల జరిగిన స్నాతకోత్సవం, సైన్స్ కాంగ్రెస్ వంటి కార్యక్రమాలలో ఓ ఉన్నతాధికారి తన సామాజిక వర్గానికి చెందిన వారికే పెద్ద పీట వేశారనే ప్రచారం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అధ్యాపకులు అర్హత కలిగినా ప్రాధాన్యం ఇవ్వటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు, అధ్యాపకులు ఏళ్ల తరబడి ఒకేపోస్టులో తిష్టవేసిన వారిని బదిలీ చేసే సాహసం చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డెవలప్‌మెంట్‌తో పాటు వివిధ పరీక్షలకు నియమించే పర్యవేక్షకులను కదిలించలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తిని తన పక్కనే సీటు కేటాయించుకోవటం వెనుక రాజకీయ ఒత్తిళ్ల భారీగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరికి మినహా మిగతా వారందరు కూడా రాజకీయ ఒత్తిళ్లతో పదవులు పొందుతున్నారనే టాక్ ఉంది. కేయూ ఇటీవల స్నాతకోత్సవంతో పాటు జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించింది. అయితే ఆశించిన స్థాయిలో ఈ రెండు కార్యక్రమాలకు పేరు, పబ్లిసిటీ రాలేదనే అభిప్రాయం ఉంది. పాలనపై కాకుండా అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకే ఉన్నతాధికారులు పాకులాడుతున్నారనే ఆరోపణలు విపిపిస్తున్నాయి.

అకడమిక్, పరిశోధనలపై దృష్టి పెడితేనే..

కొత్త పాలక మండలి కొలువై పది నెలలు గడుస్తోంది. ఇప్పటికే కబ్జాలు, అవినీతి, అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ విచారణలతో మసకబారిన ప్రతిష్టను పునఃప్రతిష్టించే కార్యక్రమాలు చేట్టాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విశ్వ విద్యాలయం తిరిగి ప్రతిష్ఠ సాధించాలంటే.. పాలనలో మార్పులు తప్పనిసరిగా రావాలని నిపుణులు సూచిస్తున్నారు. కుల ప్రాధాన్యతను పక్కనబెట్టి, అకడమిక్, పరిశోధనలపై పూర్తి దృష్టి పెట్టాలని కోరుతున్నారు. రూసా గ్రాంట్లను సక్రమంగా వినియోగించి, నూతన పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, బోధన నాణ్యతను మెరుగుపరిచి, విద్యార్థుల కేరీర్ అవకాశాలను విస్తరించాలని సూచిస్తున్నారు.

దొడ్డి దారిలో గడ్డి మందు

- మహారాష్ట్రలోని గడ్చిరోలి కేంద్రంగా గ్లైఫోసెట్ రవాణా
- విక్రయాలకు చీకటి నెట్‌వర్క్
- ఇప్పటికే రాష్ట్రంలో 80 వేల లీటర్లకు పైగా విక్రయం
- బీజీ-3 పత్తి సాగుదారులే ప్రధాన వినియోగదారులు



ఇటీవల మహాముత్తారంలో అక్రమంగా విక్రయించేందుకు నిల్వ చేసిన 300 లీటర్ల గ్లైఫోసెట్‌ను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

■ భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి

రాష్ట్రంలో వేలాది లీటర్ల నిషేధిత (గ్లైఫోసెట్) గడ్డి మందును దొడ్డిదారిలో పంపిణీ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే దాదాపు 80 వేల లీటర్ల గడ్డి మందు రవాణా జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్లో ఈ గడ్డి మందు సరఫరా చేస్తున్న ముఠా సభ్యుల మధ్య జరిగిన గొడవతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. భూసారంతో పాటు మానవ ఆరోగ్యానికి.. పర్యావరణానికి చేటు చేసే గ్లైఫోసెట్ రసాయనాలను పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చి రహస్య ప్రాంతాల్లో నిలువ చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కనీసం 50 వేల లీటర్లకు పైగా ఈ మందులు దిగుమతి అయినట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా భూపాలపల్లి జిల్లాకు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి ప్రాంతాల్లో జోరుగా సాగుతోందని అధికారులు గుర్తించారు. అయితే ఈ మందు కలుపును నివారించి ఖర్చు తగ్గిస్తుందన్న గుడ్డి నమ్మకంతో రైతులు కొనుగోళ్లకు ఎగబడుతున్నారు.

బీజీ-3 విత్తనాలు సాగుచేసిన రైతులే..

బీజీ-3 పత్తి విత్తనాలను సాగుచేసిన రైతులే ఈ గ్లైఫోసెట్ గడ్డి మందును విరివిగా వాడుతున్నారు. వాస్తవానికి దేశంలో బీజీ-3 విత్తనాలకు అనుమతి లేదు. అయినప్పటికీ అమెరికాకు చెందిన మోన్‌శాంటో కంపెనీ దళారుల ద్వారా రైతులకు అంటగట్టి సాగుచేయిస్తోందనే ఆరోపణలున్నాయి. ఆదే కంపెనీ తయారు చేసే గ్లైఫోసెట్ గడ్డి మందు చల్లితే పత్తి మొక్కలు మినహా మిగితా గడ్డి జాతి మొక్కలు చనిపోతాయి. అలా రెండు నుంచి మూడు దఫాలుగా ఈ మందు చల్లితే ఆ పొలంలో ఇక గడ్డి మొలకెత్తదు. ఒక్కసారి చల్లిన మందు ప్రభావం 21 రోజుల పాటు నేలపై ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే కలుపు నియంత్రణలో కూలీల ఖర్చు కలిసొస్తుందన్న కారణంతో రైతులు గ్లైఫోసెట్ కోసం ఎగబడుతున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు స్మగ్లర్లు అర లీటర్ మొదలుకొని 20 లీటర్ల పరిమాణం గల డబ్బాలు, క్యాన్లలో విక్రయిస్తున్నారు. ఎకరానికి 1.5 లీటర్ నుంచి 2 లీటర్ల వరకు పిచికారీ చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో రైతు రెండు హెక్టార్లకు గాను 7.5 లీటర్ల నుంచి పది లీటర్ల వరకు చల్లుతున్నారు. ఇలా పంట కాలం ముగిసే సరికి మూడు సార్లు ఈ మందును చల్లాలి. అంటే ఈ లెక్కన యేటా ఒక్కో రైతు కనీసం 20 నుంచి 25 లీటర్ల మందును వినియోగిస్తారు. దీంతో ఈ వ్యాపారం అక్రమార్కులకు మంచి ఆదాయ వనరుగా మారింది.

మహారాష్ట్రలో అయిదు లీటర్ల క్యాన్‌ను రూ.1300 కొనుగోల చేసి ఇక్కడ రైతులకు రూ.2200 నుంచి మూడు వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అలాగే మహారాష్ట్రలో 20 లీటర్ల గ్లైఫోసెట్‌కు రూ.5300 ధర పలుకుతుండగా అదే మందు ఇక్కడికి తీసుకు వచ్చి రైతులకు రూ.7600 నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇక స్వల్ప పరిమాణంలో అవసరమైన రైతులకు లీటర్‌కు రూ.500ల చొప్పున విక్రయిస్తుంటే అర లీటర్‌కు రూ.300 ధర నిర్ణయించి దొడ్డి దారిన విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆంక్షలు కఠినతరం

రాష్ట్రంలో గ్లైఫోసెట్ విక్రయాలపై ఆంక్షలు కఠినతరం చేయడంతో పాటు ఈ మందు విక్రయిస్తున్న వ్యాపారులను జైలుకు పంపడంతో కొంత నియంత్రణలోకివచ్చిందని అనుకున్నారు. కాని, వ్యాపారులే రహస్య ప్రాంతాల్లో గోదాంలను ఏర్పాటు చేసుకుని ఖరీఫ్‌కు ముందుగానే భారీగా రైతులకు చేరవేసినట్లు తెలుస్తోంది. గుజరాత్ నుంచి మహారాష్ట్ర మీదుగా ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని.. కుమరం భీం అసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాలకు దొడ్డి దారిన దిగుమతి చేసుకుని రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

గ్లైఫోసెట్‌తో క్యాన్సర్ ముప్పు

కలుపు నివారణ కోసం ఉపయోగిస్తున్న గ్లైఫోసెట్ మందు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలగజేస్తోందని వ్యవసాయ నిపుణులు తేల్చారు. ఆమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో అయిదేళ్ల క్రితమే ఈ మందును నిషేధించారు. మన పొరుగున ఉన్న శ్రీలంక 2015లోనే నిషేధించింది. అటు థాయ్‌లాండ్, వియత్నాం, లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లోని కొన్ని దేశాల్లో పాక్షిక నిషేధాన్ని అమలు చేస్తున్నారు. మన దేశంలో మాత్రం ఇప్పటికీ దీనిపై విధానపరమైన నిషేధం లేదు. ఈ రసాయనిక గాఢత వల్ల నేలలోని మైక్రో ఆర్గాన్స్ దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా భూసారం దెబ్బతిని ఇతర ఆహార పంటలు, కూరగాయల పంటలు వేస్తే కలుషితమై క్యాన్సర్‌కు దారి తీస్తుందని చెబుతున్నారు. అంతే కాకుండా దీని అవశేషాల ప్రభావం మట్టిలో దీర్ఘకాలం ఉంటుందని అంటున్నారు. ఈ మందు విక్రయాలపై తెలంగాణలో నిషేధం ఉన్నప్పటికీ దొడ్డి దారిన రాష్ట్రానికి చేరుతోంది. దీని మూలాలు గుజరాత్, మహారాష్ట్రల్లో ఉండగా ఇక్కడి చీకటి వ్యాపారులు ఆయా కంపెనీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

చార్మినార్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు డోర్నకల్ స్టేషన్‌లో హాల్టింగ్



డోర్నకల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలోని తాంబరం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే (12759) చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు, లింగంపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్లే (12737/12738)ల మధ్య నడిచే గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు మంగళవారం నుంచి డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో డీఆర్‌యూసీసీ సభ్యులు ఖాదర్, లచ్చిరాంలు దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం గోపాలకృష్ణన్, సీనియర్ డీసీఎం షఫాలీలను కలిసి పలుమార్లు డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు డోర్నకల్‌లో చార్మినార్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా రైల్వే డీఆర్‌ఎం, డీసీలకు ఖాదర్, లచ్చిరాంలు కృతజ్ఞతలు తెలిపారు.

కేయూ మేధో సంపత్తి గొప్పది


కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మేథో సంపత్తి, పేటెంట్ హక్కులను పొందేలా కృషి చేయాలని కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) సమావేశంలో నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్కాలర్స్ సిద్ధాంత గ్రంథాలను పేటెంట్‌కు అర్హత సాధించేలా రూపొందిచాలని, ఆర్థిక విలువలుండాలని సూచించారు. ఆవిష్కరణ లను ఐపీఆర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సృజనాత్మక పరిశోధనలుండాలని చెప్పారు. వర్సిటీలు మంచి పరిశోధనలు చేయాలని కోరారు. రూ.50కోట్ల రుసా ప్రాజెక్టులు వచ్చాయని, కేహబ్‌లో కొత్త పేటెంట్లు సాధిస్తామని పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్ ప్రొఫసర్ ప్రసాద్ మాట్లాడుతూ.. రుసా ప్రాజెక్టులో 10 పేటెంట్లను తీసుకువచ్చే లక్ష్యంతో పనిచేస్తామని అన్నారు. హైదరాబాద్ ఐఐసీటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సంజిత్ కేఆర్‌పాల్ మాట్లాడుతూ.. మేధో సంపత్తి ప్రపంచాన్ని నడిపిస్తోందన్నారు.

ఐఐసీటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ గుర్రాపు రాజు మాట్లాడుతూ.. పేటెంట్ దరఖాస్తు ప్రక్రియ, నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారు. అధ్యాపకులు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అకూట్ అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి, డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ బి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ములుగు
బుధవారం 10 సెప్టెంబరు 2025

ఘనంగా కాళోజీ జయంతి


ములుగు కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణ జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో మంగళారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ సంపత్‌రావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ ఏవో రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

• భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు భూపాలపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో టీపీవో సునీల్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మమత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు సాయి దుర్గలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు, తెలంగాణ భాషా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. దేవరాంపల్లి, గంగారం, దామెరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, బీసీ, ఎస్టీ బాలుర, బాలికల గురుకులాలు, తహసీల్దార్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కస్తూర్బాలో కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ అంటె నాగరాజు, ఎంపీడీవో అడ్డూరి బాబు, ప్రిన్సిపాల్స్ గట్టయ్య, నాగలక్ష్మి, రాజేందర్, టీచర్లు, జీపీ కార్యదర్శులు, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో చల్ల సునీత, అధ్యాపకులు కవిత, సరిత, విజయ, శ్రీలత, నళిని, రాజమణి, స్వప్న, మౌనిక, సుజాత, శిరీష, మణిమాల, అరుణ, రాజేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం : కాళోజీ జయంతి వేడుకలను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.నవీన్ ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, కళాశాల అధ్యాపకులు రమేష్, జీవవేణి, రాజశేఖర్, శ్రీధర్, భావన, విద్యార్థులు పాల్గొన్నారు.

• గణపురం (ఆంధ్రజ్యోతి): ప్రజా కవి కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుద్దారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు వేణు, రవి, నాగభవాని, దయాకర్ రెడ్డి, శ్రీదేవి, కరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

• ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేషం, వైస్ ప్రిన్సిపాల్ బి.బాలయ్య, అకాడమిక్ కో ఆర్డినేటర్ సి.హెచ్ భాస్కర్, న్యాక్ కో ఆర్డినేటర్ ఎస్.కవిత, అధ్యాపకులు కె.సరిత, బి.శిరీష, డి.రాధిక, ఎం. అనిల్, పి.విజిత, రాంచందర్, ఫిజికల్ డైరెక్టర్ జె.సోమన్న, లైబ్రేరియన్ డి. జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.


భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

● వాజేడు : మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాళోజీ చిత్రపటానికి ఎంఈవో వెంకటేశ్వర్లు, జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు పోరిక స్వరూప్‌సింగ్, మల్లయ్య, వెంకటరమణి, ఆనంద్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజేష్, కుమార్‌బాబు, శిండే, వసియా పాల్గొన్నారు.

• మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): కాళోజీ జయంతి వేడుకలను స్థానిక ఎంపీడీవో కార్యాయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉద్యోగులు రమేష్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలోని ఎంపీడీవో కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీరామ్మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

• సింగరేణి ఎన్విరాన్మెంట్ అధికారి పోషమల్లు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని సింగరేణి భూపాలపల్లి ఏరియా ఎన్విరాన్మెంట్ అధికారి టి. పోషమల్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 26వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా హాకీ క్రీడలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం సైతం మెరుగ్గా ఉంటుందన్నారు. చిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. యువ ఉద్యోగులు కోలిండియా స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతో వారిని క్రీడల్లో సింగరేణి ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, కోఆర్డినేటర్ దేవయ్య పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దేవరాంపల్లిలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్ర మలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు కృషితో ట్రైబల్ హాబిటేషన్స్ కనెక్టివిటీ ప్రోగ్రాం కింద దేవరాంపల్లి నుంచి ఎడ్లపల్లి వరకు 4.20కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.45కోట్ల నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా రైతులు, ప్రజలు కోరుకుంటున్న రోడ్డు మంజూరు కావడం సంతోషకర మని పలువురు నేతలు, ఎడ్లపల్లి, దేవరాంపల్లి రైతులు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, మాజీ ఎంపీపీ సమ్మయ్య, మాజీ సర్పంచులు నవీన్‌రావు, అశోక్, శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు రమేష్, తిరుపతిరావు, శ్రీనివాస్, నాయకులు చీర్ల తిరుపతిరెడ్డి, గుడిపాటి రమేష్‌రెడ్డి, ముత్తయ్య, నారాయణ, బండి రమేష్, శకుంతల, రాజ్‌కుమార్, బాలరాజు, శశికుమార్, సారయ్య, సురేష్, తిరుపతి, శ్రీనివాస్, రవి, రమేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ చేయూత

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గోల్కొండ సామ్యూల్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేయూతను అందించారు. మూడు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను తన అనుచరుల ద్వారా మంగళవారం అందజేశారు. ఈకార్యక్రమంలో చిర్ర మహేష్, చింతకుంట్ల సతీష్, నల్లభూగ నాగరాజు, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. గొప్ప కార్యం

చిట్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం గొప్ప కార్యమని, ప్రాణదానంతో సమానమని చిట్యాల ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి స్మారకార్థం ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో గ్రామంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో దాతలు ఇచ్చిన రక్తంతో ఎంతో మందికి ప్రాణాలు నిలుస్తాయన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన 30 మంది యువకులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందించి అభినందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ అక్షయ్, కాంగ్రెస్ నాయకులు పువ్వాటి వెంకటేశ్వర్లు, చింతల సుమన్, నిర్వహకులు చింతల మహేందర్, సకినాల రాకేష్, వేముల రాజు, హరీష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాటారం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వల్లెంకుంట ఫీడర్‌లో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మల్హర్ మండలాల్లో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధన్వాడ, గంగారం, దామెరకుంట, రుద్రారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుల ఎన్నిక

మహాముత్తారం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు పూర్తిస్థాయి కమిటీని ఖరారు చేశారు. మండల ఉపాధ్యక్షులుగా పసుల శివ, చాట్ల అంజిబాబు, లింగమల్ల సదువలిరావు, కాల్వపల్లి వెంకటేశ్‌ను ఎన్నుకున్నట్టు మండల అధ్యక్షుడు పూర్ణచందర్ తెలిపారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కలెక్టరేట్‌లో వీహబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా పారిశ్రామిక వేత్త లకు మంగళవారం ర్యాంప్ ఉమెన్ ఆక్సలరేషన్‌పై అవగాహన కార్య క్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా పరిపుష్టి చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తిలో భాగంగా ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తోంద న్నారు. దానిలో భాగంగానే వీహబ్ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. వరల్డ్ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు ఎంఎస్ ఎంఈలకు బిజినెస్ ఆక్సలరేషన్ సపోర్ట్ అందనుందని అన్నారు. దీనిలో భాగంగా టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, మాన్యుఫాక్చరింగ్, హస్తకళలు వంటి రంగాల్లో అభివృద్ధి చెందవచ్చని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, వీహబ్ సీఈవో సీత పల్లచోళ్ల, వీహబ్ సోషల్ ఇంపాక్ట్, ఎంట్రప్రెన్యూషిప్ విభాగం డైరెక్టర్ జాహిద్‌షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ, డీఆర్డీవో శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ తాజ్దర్‌గురు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌లు సాయిరామ్, మునీష్, సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ సిద్ధార్థరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎంలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించిన మంత్రి

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి 163 నుంచి మదనపల్లి క్రాస్ రోడ్డు (తోపుకుంట చెరువు) వరకు రూ. 4 కోట్లతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంటర్ లైటింగ్ పనులకు మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో మహిళా శక్తి పథకం ద్వారా మంత్రి సీతక్క మత్స్యకార మహిళలకు మొబైల్ ఫిష్ ఔట్‌లైట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు, డీఆర్‌డీవో శ్రీనివాస్ రావు, మునిసిపల్ కమిషనర్ సంపత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా మత్స్యశాఖ అధికారి టి. సల్మాన్‌రాజ్, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్, మండల అధ్యక్షుడు ఎండీ.చాంద్ పాషా, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ములుగులో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధనసరి సీతక్క

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి : సీతక్క

గోవిందరావుపేటసెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల విశిష్టత ప్రపంచ నలుమూలల తెలిసేలా జాతర ఏర్పాట్లు చేస్తామని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారం అభివృద్ధి పనులను పరిశీలించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న రానున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లాస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో మంగళవారం ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికిందే తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 53వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఇంకా 22వే ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలన్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు వారి రాజకీయ లబ్ధికోసం శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దేవతలను అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారని, వారికి ఆ దేవతల శాపాలు తగులు తాయని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, పెద్దసంఖ్యలో నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రాజెక్టునగర్, తదితర గ్రామాల్లోని 149 కుటుంబాలకు యునైటెడ్ వే, ఇన్ఫోసిస్ సంస్థల ఆధ్వర్యంలో సమకూర్చిన నిత్యావసర సరుకులను మంత్రి పంపిణీ చేశారు.

మేడారం అభివృద్ధిలో జాప్యం చేయొద్దు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని అన్నారు. వందల ఏళ్ల నిలిచిపోయేలా నిర్మాణాలు ఉండాలని, తల్లుల చరిత్ర ముందు తరాలకు అందించేలా ఉండాలని అన్నారు. అందుకు పూజారులు సమన్వయంతో పనిచేస్తూ గద్దెల మార్పునకు కావాల్సిన పూజ కార్యక్రమాలు సంస్కృతీ సంప్రదాయాలతో నిర్వహించాలన్నారు. పూజా కార్యక్రమాన్ని చేయడానికి దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం తల్లుల ప్రసాదాలు, పట్టు వస్త్రాలను మంత్రికి పూజారులు అందించారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎస్పీ రవీందర్, ఆర్కియాలజిస్ట్ రాజశేఖర్ పలు శాఖల అధికారులు, పూజారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్దెల మార్పుపై అభిప్రాయం తీసుకోవాలి

మేడారం అభివృద్ధిలో భాగంగా ఆర్కియాలజిస్టులు రూపకల్పన చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆదివాసీ పెద్దలు, కుల సంఘం, ఇలవేల్పుల తలపతుల అభిప్రాయాలు తీసుకోవడం మంచిదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి ప్రకటనలో తెలిపారు. గద్దెల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని తెలిపారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో కోయల మూలాలు లేవని అన్నారు. అభివృద్ధి అనే బంగారు కత్తితో మెడ కోసున్నామంటే ఎలా అని ఎద్దేవా చేశారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులకు మాత్రమే దేవతలు కాదని యావత్ భారత దేశ ఆదివాసి దేవతలు అని గుర్తు చేశారు. చరిత్ర తెలియకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే మూల్యం తప్పదని హెచ్చరించారు. అధికారుల అత్యుత్సాహం కొంపకు చేటు అనేది గత అధికారుల అనుభవాల నుంచి తెలుసుకోవాలని హితవు పలికారు. పూజారులను గౌరవిస్తున్నామని, సమన్వయ చర్చ అవసరమని అన్నారు.

గ్రామీణాభివృద్ధే ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారులు సరిగ్గా లేని అంకుషాపూర్, సోమన్‌పల్లి, సుబ్బక్కపల్లి, రామకి షాపూర్(టి) గ్రామాలలో మెంటల్ రోడ్ల నిర్మాణానికి రూ. కోటి 20 లక్షలు మంజూరు చేశామన్నారు. వెంటనే సంబంధిత అధికారులు పనులు ప్రారంభించి సకాలంలో పూర్తియ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేష్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యం, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మండల నాయకులు తిప్పిరెడ్డి కృష్ణరెడ్డి, మోతే రాజమౌళి, బండి రవీందర్, తేడేటి కుమార్, దొంతుల శ్రీనివాస్, ఓరం సమ్మయ్య, నారయణరావు, కత్తి సంపత్, జంగపెల్లి సారయ్య పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం నుంచి జూకల్లు వరకు రూ.30లక్షల నిధులతో నిర్మించనున్న బీటీరోడ్డు, ఇస్సిపేట నుంచి చింత లపల్లి వరకు రూ.కోటితో నిర్మించనున్న బీటీరోడ్డు, ఇస్సిపేట నుంచి వాగొడ్డుపల్లి వరకు రూ.కోటి 20లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సునీత, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు తక్కళ్లపల్లి రాజు, ఎమ్డీ.రఫి, పోలినేని లింగారావు, యార రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ పురోగతికి కృషి చేయాలి

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తిరుమల

కాటారం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల పురోగతికి కృషి చేయాలని కాటారం ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల అన్నారు. మండల కేంద్రమైన కాటారంలో ఏఎంసీ ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ సహకారంతో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. తెల్ల, నల్లజాతి పశువులు, గొర్రెలు, మేకలకు టీకాలు వేయడం, గర్భకోశ సమస్యలకు చికిత్సలు, మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పశుసంపద అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని. పశుసంపద వృద్ధితో పర్యావరణానికి మేలు జరుగుతుందని, పాడిపంటలు బాగుంటాయన్నారు. పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. పశు వైద్యశిబిరాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, డైరెక్టర్లు తిరుపతిరావు, రమేష్, శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ రాజబాబు, ఏఎంసీ, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికే పార్టీ పదవులు

మహిళా కాంగ్రెస్ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి

ములుగు టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడితేనే పదవులు వరిస్తాయని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అంగోతు సుగుణ, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు రాలు మద్దాలి నాగమణి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోమహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, మండల, గ్రామ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

వాజేడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన వరదలకు ఇబ్బందులకు ఎదుర్కొన్న బాధితులకు హైదరాబాద్‌కు చెందిన యునైటెడ్ వే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని బొమ్మనపల్లిలో 127 కుటుంబాలకు బియ్యం, పప్పులు, ఉప్పు, తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో జీపీ సెక్రటరీ ప్రసాద్, స్వచ్ఛందసంస్థ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీపీవోలుగా ముగ్గురు ఎంపిక

వాజేడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న బాలచంద్రమూర్తి, అనూష, ధనమ్మ జీపీవోలుగా ఎంపికయ్యారు. రికార్డు అసిస్టెంట్ విధుల నుంచి మంగళవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ ముగ్గురిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ రాంసింగ్, ఆర్ఐ కుమారస్వామి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు

• జామా మసీదు కమిటీ అధ్యక్షుడు అఫ్జల్ పాషా


సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి పాటుపడుతున్న మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని జామా మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ పాషా అన్నారు. మండలంలోని ముస్లింలకు మంత్రి సీతక్క ఇటీవల రూ. 1.5 కోట్ల నిధులతో మైనారిటీ కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి సీతక్క నిధులను మంజూరు చేయడంతో మైనారిటీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్‌ఖాన్, జిల్లా యూత్ కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాషా, మాజీ జడ్పీటీసీ ఎమ్డీ. వలియాబీ, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎమ్డీ. అయూబ్‌ఖాన్, జామా మసీదు కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిఫ్, ఉపాధ్యక్షుడు రజాక్, కోశాధికారి సుజాయుద్దీన్ సర్కార్, ముస్లిం పెద్దలు ఖాజా, ఎమ్డీ సలీం, వాజిద్, ఎమ్డీ. చాంద్, ఎమ్డీ. అజ్మత్ ఖాన్, జియా పాల్గొన్నారు.

అశోక్‌ది హత్యనేనా..?

మిస్టరీగా అనుమానాస్పద మృతి కేసు

సొంత వారే మట్టుపెట్టారని జోరుగా ప్రచారం

పోలీసుల అదుపులో ముగ్గురు?

వెంకటాపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపేటలో సోమవారం అనుమానాస్పద మృతి కేసు మిస్టరీగా మారింది. దుర్గం అశోక్(40) హత్యకు గురయ్యాడా.. ఏదైనా ప్రమాదానికి గురై మృతి చెందాడా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ కేసును పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. మృతదేహంపై ఉన్న గాయాలనుబట్టి ఇది ముమ్మాటికీ హత్యేననే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ సభ్యుల్లో ఒకరితోపాటు ఇద్దరు బంధువులు అశోక్‌ను హత్యమార్చారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వ్యవసాయం చేస్తుండగా చిన్న కుమారుడు అశోక్ ఆన్‌లైన్‌లో బెట్టింగులకు అలవాటు పడినట్లు తెలుస్తోంది. ఇతడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆన్‌లైన్‌లో ఆర్థికంగా నష్టపోవడంతో అశోక్ మద్యానికి అలవాటు పడ్డాడని తెలిసింది. ఈ క్రమంలో భార్యా పిల్లలతో కలిసి రెండునెలల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అయితే.. అక్కడి వాతావరణం నచ్చక పది రోజుల్లోనే స్వగ్రామానికి తిరిగి వచ్చినట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. అప్పుల బారిన పడిన అశోక్ తన వ్యవసాయ భూముల్లో రెండెకరాలను అప్పటికే విక్రయించినట్లు తెలుస్తోంది. మిగతా నాలుగెకరాలపై నలుగురైదుగురి వద్ద ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర అప్పులు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం రాత్రి ములుగులో నివాసముంటున్న తండ్రి వద్దకు వెళ్లి డబ్బుల కోసం గొడవ చేసినట్లు సమాచారం. దీంతో క్షణికావేశానికి గురైన తండ్రి కర్రతో తలపై బలంగా కొట్టాడని, దీంతో అశోక్ మృతి చెందాడని జోరుగా ప్రచారం సాగుతోంది. మృతదేహంపై గాయాలు ఉండడంతో మృతుడి భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టినట్టు తెలిసింది. ఈ క్రమంలో నిందితులు ముగ్గురిని అదుపులో ఉన్నట్లు సమా చారం. బుధవారం వారిని ములుగు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిసింది.